

# తెర

నందం రామారావు

(గత సంచిక తరువాయి)

''చెప్తా నరుణా. మన ఖరీదైన సుఖానికి అడ్డొచ్చేవారెవరూ నాకు లేరు. కానీ... పరిస్థితుల ప్రాబల్యం. వాటి వెనుక వికృతంగా కలిసించే శక్తులూ వాటి మధ్య నలిగిపోయాన్నేను'' ముకుందం బాధ పడుతూ అన్నాడు.

''అవును. నలిగిపోయావ్. అందుకే పారిపోయావ్.''

''నీకు హేళనగానే వుంది. ఇప్పుడు నీకేం చెప్పినా అర్థం కాదు. ఓ రోజు నీకు అంతా చెబుతాను'' ముకుందం చొరవగా అరుణ చేతుల్ని తనలోకి తీసుకోబోయాడు.

అప్పుడరుణ కోపంగా అంది—''ఒక వ్యక్తిని నమ్ముకున్నాను. ఆ వ్యక్తి నా వాడు. నన్నర్థం చేసుకున్నాడని మురిసిపోయాను. కారణం లేకుండా పారిపోయావ్. చాలు ముకుందం,చాలు! నీ కథను హృదయవిదారకంగా చెప్పగలవు. గడిచిన చెడ్డ రోజులను మరచిపోదామంటావ్. అవునా?''

''నువ్విలా తుంచేసి మాట్లాడుతుంటే నేనేం మాట్లాడగలను?''

''ముకుందం! ఇంత సేపూ నీ గురించే మాట్లాడగలిగావు గానీ, నా పరిస్థితిని గురించి ఏమైనా ఆలోచించావా? నో. ఆలోచించలేకపోయావ్. అది నీ చేత కాలేదు. కాదు కూడానూ.''

అరుణ గడ్డి లోంచి లేచింది. విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయింది.

ఆమె వెడుతున్న వైపే చూస్తుండిపోయాడు ముకుందం.

** ** **

పై సన్నివేశంలో ఓ అందమైన యువతి, ఓ యువకుడూ కలుసుకుని అలా మాట్లాడుకున్నారంటే, దానికేదో బలమైన కారణం వుంది.

వారిలా పార్కులో కలుసుకుని మాట్లాడ్డానికి రెండు, సంవత్సరాల ముందు —

అరుణా, ముకుందం ఒకే ఆఫీసులో పని చేసే వారు. వారిద్దరూ—కథల్లో లానే ప్రేమించుకున్నారు. ఎన్నో బాసలు, వాగ్దానాలూ, దేవుడి మీద ఒట్లూ వేసుకున్నారు. పెళ్లి చేసుకోవాలనుకున్నారు. దాదాపు పెళ్లి స్థిరపడింది. ఆఫీసులో అందరికీ తెలిసింది. ఆ ఇద్దరినీ అభినందించారు. ఇదీ కథ.

వాళ్లెలా పరిచయమయ్యారు, వారెక్కడ ప్రేమించుకున్నారూ ఇక్కడనేను రాయను. పరిచయాలూ, ప్రేమలు-వీటి గురించి చాలా మంది చాలా రకాలుగా రాశారు గనుక!

** ** **

సాయంత్రం పార్కు కొత్త పెళ్లికూతురులా వుంది.

అరుణ మూలన వున్న ఓ చెట్టు దగ్గర కూర్చుంది. ఇవేళ ఆమె మనసంతా దిగులుగా, ఆవేదనగా వుంది.

అక్కడికి ఆమెను వెదుక్కుంటూ ముకుందం వచ్చా

డు. ''అరుణా! నువ్వు నా కోసమే ఎదురు చూస్తూ కూర్చున్నట్లున్నావ్. చాలా థాంక్స్.''

''నేనిక్కడ వున్నానని నీకెలా తెలుసు?''

''నీ ఉనికి నాక్కాకపోతే ఇంకెవరిక్కావాలి?''

''ఎందుకు ముకుందం, మళ్లీ నన్ను ప్రలోభపెట్టాలని చూస్తావ్?''

''ఇది నీ మాటా?''

''అవును. నా బతుకులో మరోసారి నిప్పులు పోయకు. ఇక్కడ నేను చాలా సుఖంగా బతుకుతున్నాను. ఒకసారి మనసు విరిగిన తర్వాత నా వెంట బడడం మంచిదికాదు. ఇది నీకు న్యాయం కాదు. కచ్చితంగా చెబుతున్నాను. ఇంకెప్పుడూ నన్ను కలుసుకోవడానికి ప్రయత్నించకు!''

''నిన్ను నమ్ముకున్నవాడితో ఇలాగేనా మాట్లాడేది?''

''ముకుందం! ఈ రెండు సంవత్సరాల్లో నేను చాలా తెలుసుకున్నాను. ఇప్పుడు నేను అమాయకురాలిని కాను. నువ్వు చెప్పేమాటలను నమ్మేటంతటి అవివేకురాలిని కాను. దయచేసి వెళ్లిపో!''

ముకుందం తలొంచుకున్నాడు.

మళ్లీ అరుణ అన్నది—''ముకుందం! ఒకో నిజం చెప్పేదా? నువ్వు చేసిన మోసం నన్ను ప్రతిక్షణం వెంటాడుతోంది. మానసికంగా నేను చాలా క్రుంగిపోయాను. ఒక విధంగా నువ్వు నాకు మేలే చేశావ్.''

''నన్నింక మాటలతో బాధ పెట్టొద్దు. తప్పు నాదే. కాదనను. కొన్ని విచిత్రమైన సంఘటనలు నన్ను తప్పు దారి పట్టించాయి.

''ఏవిటవి?''

ముకుందం మాట్లాడలేదు.


''చెప్పు ముకుందం. పర్వాలేదు. నువ్వనుకునే విచిత్రమైన పనేదీ నేను చెయ్యలేదు. చెప్పు.''

''నన్ను అపార్థం చేసుకోవు గదూ?'' అరుణ మాట్లాడలేదు.

''ఓ రోజు రాత్రి. ఆ రోజేదో గుర్తులేదు. మనసు చిత్రమైన వూహల్లో వుండగా సెకండ్ షో కెళ్లాను. సినిమా వదిలిన తర్వాత బయట కొచ్చాను. ఒక పక్కగా నుంచుని వెళ్లిపోయే జనాన్ని చూస్తున్నాను. అప్పుడక్కడ నువ్వు కనిపించావు. మనం ఆ సాయంత్రం కలుసుకున్నప్పుడు, నువ్వు సినిమాకు వెడుతున్నట్లుగా చెప్పలేదు. ఆశ్చర్యపోయాను. అంతలో, ఓ యువకుడు నీ దగ్గర కొచ్చాడు. మీరిద్దరూ ఏవేవో మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ వెళ్లిపోయారు. నేను అనుమానంతో, అవమానంతో మిమ్మల్ని వెంబడించాను. అతను నీ పక్కనే నడుస్తుంటే భరించలేకపోయాను. నేనిదివరకు అతన్నెప్పుడూ చూడలేదు.

''నా కంటే అతనే నీకెక్కువ అనిపించింది. నీ గది వరకూ వెంబడించాను. నువ్వు గది తాళం తీసి లోపల కెళ్లావ్. అతను, నిన్ను అనుసరించాడు లోపలకు.. అక్కడి నుండి గబగబా వచ్చేశాను. నువ్వొక పెద్ద మోసకత్తెవనీ, మనుషులతో ఆడుకోవడం నీకో సరదా అనీ నమ్మాను. ఆ మరుసటి రోజు మనం కలుసుకున్నప్పుడు మాటల్లో నువ్వు సినిమాకెళ్లినట్లు చెప్పలేదు. నా అనుమానం బలపడింది. ఆ తర్వాత కథ నీకు తెలుసు...''

అప్పుడరుణ ఫకాల్న నవ్వింది—నవ్వి—



''అతనెవరో తెలుసుకున్నావా?'' అన్నది.

ముకుందం సిగ్గుపడ్డాడు.

''చాలా ఆలస్యంగా నిజం తెలుసుకున్నాను. ఈ లోపలే నువ్వు అక్కడ నుంచి వెళ్లిపోయావ్. నీ కోసం ప్రయత్నం చేశాను. నీజాడ తెలియలేదు.''

''ముకుందం! ఒక చిన్న కారణాన్ని, అనుమానాన్ని భూతద్దంలో చూసి నా కలలన్నింటినీ కూల్చేశావ్. నాతో సినిమా కొచ్చినతను ఎవరో నన్నడిగినా చెప్పేదాన్ని. నన్నడగడం నీకు చిన్నతనమనిపించింది. అభిమానం అడ్డొచ్చింది. అనుమానాన్ని పెంచుకుని, కనిపించకుండా తప్పించుకుని తిరిగావ్. నాతో సినిమా కొచ్చిన అతనెవరో ఇప్పుడైనా నీకు తెలుసా? చెప్పేదా? అతను మా పెద్దమ్మగారబ్బాయి.''

''ఒప్పుకుంటున్నా నరుణా.''

''అడుగుతున్నానని మరోలా అనుకోకు. ఇప్పుడు నేను ఉద్యోగం చేసుకుంటున్నాను. ఉద్యోగం చేసే ఆడది, మగవారితో ఒక్కోసారి చనువుగా మాట్లాడవలసి వుంటుంది. రకరకాల వ్యక్తులు పరిచయమవుతూ ఉంటారు. వారితో మాట్లాడక తప్పదు. అటువంటి వారందరూ నీతి లేని ఆడవాళ్లేనా?''

''దారుణంగా మాట్లాడుతున్నావ్?''

''నిజం మాట్లాడుతున్నాను నేనడిగిన దానికి నీ అభిప్రాయమేమిటో చెప్పలేదు.''

''అంత నీచుణ్ని కాను.''

''మరి జరిగిందేవిటి?''

''అరుణా, నన్ను క్షమించు. నేనీ క్షణం లో నిన్ను పెళ్లి చేసుకుంటాను.''

''నేన్నిన్ను చేసుకోలేను. మన పెళ్లయిన తర్వాత, నేనెవరితోనే మాట్లాడుతున్నానని నన్నవమానించి బాధ పెడితే నా బతుక్కి గ్యారంటీ ఏవిటి? నువ్వలా చేయవనీ నమ్మకం ఏవిటి?''

ఇంత సూటిగా అరుణ మాట్లాడే సరికి, ముకుందం అవాక్కయ్యాడు. అరుణతో ఎన్నెన్నో చెప్పాలనుకున్నాడు. అందుకు ఆమె అవకాశం ఇవ్వలేదు!

** ** **

నాలుగు సంవత్సరాలు గడిచాయి.

ఈ నాలుగేళ్లలో ఎన్నో

# గుప్పెడు గుండెను తట్టి పలకరించే గుప్పెడు గింజల అంతర్యం

సాహిత్యానికి, సమాజానికి ఎంతో దగ్గర సంబంధ ముంది. గతంలో పద్యం, వర్తమానం వచనకవిత అన్నట్లు. ఒకప్పుడు పద్యకవితలు, తర్వాత వచనకవితలు ఎంతో విరివిగా వచ్చాయి, వస్తున్నాయి కూడా. నేడు కవిత్వం నదీప్రవాహంలో తేలియాడే చిరు అలల్లా కొత్త పుంతలు తొక్కుతోంది. శ్రీమతి ఎన్. అరుణగారు తమ అనుభూతి ఆలంబనతో ఆకాశమంత అర్థాన్ని ఈ గుప్పెడు గింజల రూపంలో మనముందుంచారు.

అందుకు ఉదాహరణే పుస్తకం తెరువగానే బోసినవ్వుల బుడతడి మమతాదర్శనం...

మొదటగా అరుణగారు అన్నారు, తాను నానీలు రాస్తాననుకోలేదు ఎందుకంటే నానీలు వ్రాయడం అంత సులభం కాదని., అలా అంటూనే ప్రతి వాక్యంలో 'నా' 'నీ' అనే అక్షరాలకు అర్థం ఎంతో హుందాగా తెలియజేశారు. ఈ విషయంలో అరుణగారు రాయలేనేమో అని ఊరుకుంటే, ఎన్నో జీవితపార్శ్వాలను మనం స్పృశించలేకపోయేవారమేమో అనిపిస్తుంది.

నేడు సాహిత్యం ఏదో వాదానికి కట్టుబడిపోయి, తద్వారా భావపటిమను కోల్పోతోంది. కానీ ఇది ఏ వాదానికి చెందినది కాదు. అతి తక్కువ పదాలతో హృదయాన్ని తట్టి పలకరించే ప్రయోగం ఇది. ఒక్కో మాట ఎంతో సూటిగా ఎక్కు పెట్టిన బాణాల్లా వున్నాయి.

అందుకు ఉదాహరణగా.. ''మా నాన్న/ చెరకు పండించేవాడు/అందుకే /అనుబంధాల్లో అంత తీపి'' అనే వాక్యాలలో ఆత్మీయత.

''నిశబ్దానికి/ వైశాల్యముండదు/ వుండేది/ అగాధమయిన లోతే''లో తాత్వికత..

''రోజా/స్మశానం నిండా కన్నీళ్లు/ అందుకే /ఈ పూలరంగు ప్రత్యేకం''లో భావతీవ్రత.

''బాధను/అనుభవించాల్సిందే/మనిషైనా/మహాప్రపంచమయినా''లో వాస్తవికత..,

''ఫ్యామిలీ ఫోటోకు/దుమ్ము పట్టింది/ తుడిస్తే/మా అమ్మ ముఖమే మిగిలింది'' వాక్యాలలో యథార్థత..

''ఈ నీడలో/నించొనే మాట్లాడతాను/ ఆమె గురించైనా/ ప్రేమ గురించైనా...''లో విలక్షణమైన భావస్ఫోరకాల్ని చేర్చి, కూర్చి, సాహితీ వుద్యానవనంలోకి అమ్మతనపు అక్షరపు విత్తనాల్ని ప్రేమతో వెదజల్లిన ఈ కవయిత్రి, కవిత్వంలో ఎంతో పట్టు సంపాదించుకున్నారని తెలుస్తోంది. ఈ అక్షరాలన్నీ అనురాగంతో పలకరించే భావసముచితం.

నేడు సాహిత్యం ఏదో వాదానికి కట్టుబడిపోయి, తద్వారా భావపటిమను కోల్పోతోంది. కానీ ఇది ఏ వాదానికి చెందినది కాదు. అతి తక్కువ పదాలతో హృదయాన్ని తట్టి పలకరించే ప్రయోగం ఇది. ఒక్కో మాట ఎంతో సూటిగా ఎక్కు పెట్టిన బాణాల్లా వున్నాయి.

''మాటల్ని ప్రయోగించడం/మానేద్దాం/ అపుడు కానీ/గొప్ప పద్యం పుట్టదు'' అంటూ పదాలు ఎంత తక్కువైతే భావతీవ్రత అంత గట్టి పడుతుందనే విషయాన్ని ''గింజలు/ గుప్పెడే అయినా/కడుపులోకి వెళితే/రక్తకణాలు'' లాంటి వాక్యాలు చాలు మనకి విషయం విశదీకరించడానికి-అని ఎంతో క్లుప్తంగా తెలిపినా అందులోనే సముద్రమంత వివరాన్ని మనకు ఎన్. అరుణగారు తెలిపారు.

''విత్తనమంత అక్షరంలో మహావృక్షమంత అర్థం కవిత; బిందువంత పదంలో సింధువంత పరమార్థం కవిత;'' అని ఇటీవల ఒక ప్రముఖకవి అన్నట్లు గింజ ఎంతో సూక్ష్మమైనా పాఠకుల గుప్పెడు గుండెను తట్టి లేపిన కవయిత్రి ఎన్. అరుణగారి కలం నుండి మరిన్ని నిత్యసత్యాలయిన అక్షర ముత్యాల్ని ముందు ముందు పాఠకులు ఏరుకుంటారని భావిరచవచ్చు.

**శైలజామిత్ర**

**గుప్పెడు గింజలు**
**కవయిత్రి:**
**ఎన్. అరుణ**
**ప్రతులకు:**
**ఎన్. అరుణ, 13—1/5,**
**రామంతపూర్,**
**హైదరాబాద్—13,**
**మరియు అన్ని పుస్తకవిక్రయకేంద్రాలు.**

---

మార్పులు చోటు చేసుకున్నాయి.

ఒకానొక సాయంత్రం—బజారులో అనుకోకుండా శంకరానికి, ముకుందం ఎదురయ్యాడు. ఆ ఇద్దరూ కలుసుకుని చాలా కాలమైంది.

మిత్రుడు ముకుందాన్ని చూడ్డంతోనే శంకరం ఎంతో సంతోషించాడు. ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ముకుందానికి ఇంకా పెళ్లి కాలేదని తెలుసుకుని బాధ పడ్డాడు. త్వరగా పెళ్లి చేసుకోమని హితవు పలికాడు. శంకరం, ముకుందాన్ని తనింటికి తీసుకెళ్లాడు. చూడచక్కగా వున్న డాబాను శంకరం చూపించి—''ఇదేరా మా వెన్నెల భవనం'' అన్నాడు.

ముకుందం ఎదురుగా వున్న డాబాను చూశాడు. ముచ్చటగా ఉంది. చక్కటి గార్డెన్. అన్ని రకాల మొక్కలూ వున్నాయి.

శంకరం, ఆప్యాయంగా ముకుందం చేతిని పట్టుకుని సోఫాలో కూర్చోపెట్టి, ''వెన్నెలా!'' అంటూ భార్యను పిలిచాడు.

''వెన్నెలా! ఇతను నా ఫ్రెండ్ ముకుందం. ఒరేయ్, ఈమె నా భార్య అరుణ. నేనే 'వెన్నెలా' అని ప్రేమగా పిలుచుకుంటాను'' అంటూ పరిచయం చేశాడు.

తలెత్తి నమస్కారం చేసిన ముకుందం, శంకరం భార్యగా అరుణను చూసి 'షా'కయ్యాడు. నోట మాట రాలేదు. ముఖం పాలిపోయింది. అరుణకేసి చూడలేకపోయాడు. తల దించుకున్నాడు.

శంకరం తన భార్య అరుణను గురించి చెబుతున్నాడు. వాటిని వినిపించుకునే స్థితిలో ముకుందం లేడు. ముకుందం హఠాత్తుగా లేచి, ''శంకరం! నాకు టైమయింది. వెడతా''నంటూ గబగబా బయటకొచ్చి వడివడిగా నడవసాగాడు.

మిత్రుడి ప్రవర్తనేమిటో అర్థం కాక, శంకరం, ఆశ్చర్యంగా వెళ్లిపోతున్న ముకుందాన్ని చూస్తుండిపోయాడు! ●